# కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక

## కర్నూలు - నంద్యాల

ఆదివారం, మే 31, 2026 పేజీలు 5


## ఆపరేషన్ క్లీన్ స్వీప్‌కు శ్రీకారం

- ఏ. క్యాంప్‌లో డ్రైనేజీ కాలువ వద్ద పరిశుభ్రత కార్యక్రమాల ప్రారంభం
- కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, డీఎంఏ సంపత్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా చర్యలు
- కాలువల శుభ్రతతో నగరంలో పరిశుభ్రమైన వాతావరణానికి కృషి
- స్వచ్ఛమైన కర్నూలు నిర్మాణానికి ప్రజల సహకారం కోరిన అధికారులు

2




# మండిపోతున్న ఎండలు!





- వేడి గాలులతో ప్రజల జీవనం అస్తవ్యస్తం
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 44 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్న పరిస్థితి
- వడదెబ్బ భయంతో ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు
- రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం
- వాతావరణ మార్పులతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల ముప్పు



‘ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. వడగాలుల ప్రభావంతో మధ్యాహ్నా వేళల్లో రహదారులు నిర్మానుష్యంగా మారుతుండగా, వడదెబ్బ భయంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మరోవైపు రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు ప్రజల కష్టాలను మరింత పెంచుతున్నాయి.

- కర్నూలు బ్యూరో, కొత్తస్వరం’

2

## నేర నియంత్రణే లక్ష్యం





- పోలీసు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలి
- ఐపీఎల్ ఫైనల్ నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా
- గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు విస్తృత తనిఖీలు
- జూన్ నెలలో ‘ఆపరేషన్ దండాయన’ను సమర్థవంతంగా అమలు చేయాలి
- సైబర్ నేరాలు, మిస్సింగ్ కేసులపై తక్షణ స్పందనకు ఆదేశాలు
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో అధికారులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ దిశానిర్దేశం

5

## శ్రీవాణి దాతలకు టీటీడీ గుడ్‌న్యూస్

- టికెట్ల జారీ విధానంలో కీలక మార్పులు
- ప్రతిరోజూ 300 ప్రత్యేక దర్శన టికెట్లు
- జూన్ 10 నుంచి కొత్త విధానం అమలు
- తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో 200 టికెట్ల కరెంట్ బుకింగ్
- 2027 మార్చి 31 వరకు అమల్లో ఉండనున్న నూతన విధానం

4



## యువత భవిష్యత్తు కాపాడటమే మా లక్ష్యం

- డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా
- మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్న పోలీసులు
- గ్రామాల్లో శాంతిభద్రతల కోసం కఠిన చర్యలు
- ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థ
- విద్యార్థులు లక్ష్యాలను మరిచిపోవద్దన్న సీఐ సుబ్రహ్మణ్యం

3



# మండిపోతున్న ఎండలు..!



**వేడి గాలులతో ప్రజల జీవనం అస్తవ్యస్తం**

**కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 44 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు**

**మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్న పరిస్థితి**

**వడదెబ్బ భయంతో ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు**

**రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం**

**వాతావరణ మార్పులతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల ముప్పు**

**కర్నూలు బ్యూరో, కొత్తస్వరం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి ఏడాది ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వేసవి ప్రారంభమైతేనే ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. ఉదయం నుంచే మండే ఎండలు మొదలవుతుండటంతో మధ్యాహ్న సమయాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేడి గాలుల ప్రభావంతో చిన్నారులు, వృద్ధులు, కూలీలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం.

**వడగాలులతో బయటకు రావడానికే భయం..**

ఉమ్మడి జిల్లాలో మధ్యాహ్నం సమయంలో వేడి గాలులు తీవ్రంగా వీస్తుండటంతో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావడం లేదని తెలుస్తోంది. రహదారులపై వేడి ప్రభావం అంతగా ఉండటంతో వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్సు స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన కూడళ్లు మధ్యాహ్న సమయాల్లో ఖాళీగా కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్లపై నడవడమే కష్టంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కూలీలు, రైతులపై తీవ్ర ప్రభావం..**

ఎండల ప్రభావం ఎక్కువగా రోజువారీ కూలీలు, రైతులపైనే పడుతోందని సామాజిక వర్గాలు చెబుతున్నాయి. వ్యవసాయ పనులు, నిర్మాణ పనులు చేసే కార్మికులు మండే ఎండల్లో పని చేయాల్సి రావడంతో ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని సమాచారం. ఉదయం నుంచే పనులు ప్రారంభించి మధ్యాహ్నానికి పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని కార్మికులు చెబుతున్నారు. కొంతమంది కూలీలు వడదెబ్బకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఘటనలు కూడా నమోదవుతున్నాయని సమాచారం.

**నీటి కొరత మరింత పెరుగుతోంది..**

తీవ్ర ఎండల కారణంగా తాగునీటి సమస్య కూడా ఉమ్మడి జిల్లాలో తీవ్రమవుతోందని ప్రజలు చెబుతున్నారు. బోర్లు ఎండిపోవడం, చెరువులు అడుగంటిపోవడం వల్ల గ్రామాల్లో ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తోందని సమాచారం. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొన్ని మండలాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. నీటి కోసం ప్రజలు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**విద్యుత్ వినియోగం పెరిగి అంతరాయాలు..**

ఉష్ణోగ్రతలు పెరగడంతో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం భారీగా పెరుగుతోంది. దీంతో విద్యుత్ వినియోగం అధికమై కొన్నిచోట్ల లోడ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు కూడా ఎదురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ పవర్ కట్స్ కారణంగా ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. రాత్రివేళ విద్యుత్ లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

**పంటలపై ఎండల ప్రభావం..**

వేడి గాలులు, అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో పంటలు కూడా దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని సమాచారం. కొన్ని ప్రాంతాల్లో పశువులకు కూడా తాగునీరు, మేత కొరత ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. ఎండల కారణంగా పాల ఉత్పత్తి కూడా తగ్గుతోందని చెబుతున్నారు.

**వడదెబ్బ కేసులు పెరుగుతున్నాయా..?**

తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ కేసులు పెరుగుతున్నాయని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, బీపీ, షుగర్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్, తలనొప్పి, వాంతులు, అలసట వంటి సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోందని సమాచారం.

**వాతావరణ మార్పుల ప్రభావమేనా..?**

ప్రతి ఏడాది ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంపై పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవుల తగ్గుదల, భూగర్భ జలాల క్షీణత, పట్టణీకరణ, కాలుష్యం, వాతావరణ మార్పులు వంటి కారణాలతో వేడి తీవ్రత పెరుగుతోందని చెబుతున్నారు. భవిష్యత్తులో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ప్రజల డిమాండ్లు..**

గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరా పెంచాలి. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలి. అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి. పశువులకు ప్రత్యేక నీటి వసతులు కల్పించాలి. "ఎండలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి... కానీ శాశ్వత చర్యలు మాత్రం కనిపించడం లేదు" అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేడి గాలుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆపరేషన్ క్లీన్ స్వీప్‌కు శ్రీకారం

**కర్నూలు, మే 30(కొత్తస్వరం) :**





ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలోని ఏ. క్యాంప్ ప్రాంతంలో అశ్విని ఆసుపత్రి సమీపంలోని డ్రైనేజీ కాలువ వద్ద పరిశుభ్రత కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సంపత్ కుమార్ శనివారం ప్రారంభించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, కాలువల శుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. పరిశుభ్రమైన నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు పిలుపునిచ్చారు.

## వైసీపీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వంగాల నాగేశ్వర్ రెడ్డి

**ఘనంగా సత్కరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు**



**వెలుగోడు, మే 30 (కొత్త స్వరం):**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆశీస్సులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన వెలుగోడు మాజీ సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వర్ రెడ్డిని అబ్దుల్లాపురం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువా కప్పి నాగేశ్వర్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. వంగాల నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్రీశైలం నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు మద్దెల రాఘవేంద్ర రెడ్డి, అబ్దుల్లాపురం గ్రామ వైసీపీ అధ్యక్షుడు ఈడిగే నాగశేషులు గౌడ్, పోరెడ్డి చిన్నస్వామి రెడ్డి, మాజీ సచివాలయ కన్వీనర్ ఫకూరు భాష, మద్దెల విజయవర్ధన్ రెడ్డి, గని వెంకట్రాం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి తదితర గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

**కలెక్టర్ డా. ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సమీక్ష**






**కర్నూలు, మే 30 (కొత్త స్వరం):** ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం అమలుకు సంబంధించి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం కర్నూలు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరై చట్టం అమలు తీరును సమీక్షించారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి సంబంధించిన కేసుల పురోగతి, బాధితులకు అందిస్తున్న సహాయ సహకారాలు, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అలాగే చట్టం సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితులకు న్యాయం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తు కాపాడటమే మా లక్ష్యం

- డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా
- మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్న పోలీసులు
- గ్రామాల్లో శాంతిభద్రతల కోసం కఠిన చర్యలు
- ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థ
- విద్యార్థులు లక్ష్యాలను మరిచి పోవద్దన్న సీఐ సుబ్రహ్మణ్యం



**కొత్త స్వరం నందికొట్కూరు**

ప్రస్తుతం సమాజంలో వేగంగా పెరుగుతున్న డ్రగ్స్ ముప్పు, సైబర్ నేరాలు, యువతలో మారుతున్న జీవనశైలి వంటి అంశాలు పోలీస్ శాఖకు పెద్ద సవాళ్లుగా మారాయని నందికొట్కూరు సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన, మహిళల భద్రత, గ్రామాల్లో శాంతిభద్రతలు, యువత భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. నందికొట్కూరులో పోలీసింగ్ విధానం, ప్రజా భద్రతపై "కొత్త స్వరం"కు శనివారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సీఐ సుబ్రహ్మణ్యం పలు కీలక విషయాలు వెల్లడించారు.

**ప్రశ్న: నందికొట్కూరులో ప్రస్తుతం పోలీస్ శాఖకు అతిపెద్ద సవాల్ ఏమిటి?**

**సీఐ సుబ్రహ్మణ్యం:** ప్రస్తుతం యువతలో పెరుగుతున్న డ్రగ్స్ అలవాటు, సైబర్ మోసాలు ప్రధాన సవాళ్లుగా మారాయి. సోషల్ మీడియా ప్రభావంతో కొంతమంది యువకులు తప్పుదోవ పడుతున్నారు. మరోవైపు ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయి. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. నందికొట్కూరులో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతర నిఘా కొనసాగుతోంది.

**ప్రశ్న: యువతలో డ్రగ్స్ నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**సీఐ సుబ్రహ్మణ్యం:** కాలేజీలు, స్కూళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలి. యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకునే అలవాట్లకు దూరంగా ఉండాలి.

**ప్రశ్న: మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలున్నాయా?**

**సీఐ సుబ్రహ్మణ్యం:** మహిళల భద్రతకు మా శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈవ్ టీజింగ్, వేధింపులపై ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచాం. మహిళలు ఎలాంటి సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలని కోరుతున్నాం. మహిళలకు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత.

**ప్రశ్న: గ్రామాల్లో పెరుగుతున్న గొడవలను ఎలా నియంత్రిస్తున్నారు?**

**సీఐ సుబ్రహ్మణ్యం:** చిన్న చిన్న వివాదాలే పెద్ద గొడవలకు దారి తీస్తున్నాయి. అందుకే గ్రామాల్లో ముందస్తు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భూవివాదాలు, కుటుంబ కలహాలు, యువత మధ్య తగాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో కలిసి శాంతియుత వాతావరణం కోసం పనిచేస్తున్నాం.

**ప్రశ్న: విద్యార్థులకు మీరు చెప్పాలనుకునే సందేశం ఏమిటి?**

**సీఐ సుబ్రహ్మణ్యం:** విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావానికి లోనవకుండా చదువుపై దృష్టి పెట్టాలి. చెడు స్నేహాలు, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగాలి. ఏ సమస్య వచ్చినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలి. యువత మంచి మార్గంలో నడిస్తే సమాజం కూడా మంచి దిశగా వెళ్తుంది.

# కార్మిక హక్కుల పరిరక్షణలో సిఐటియు పోరాట స్ఫూర్తి

- **56వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో నాయకుల పిలుపు**
- **కష్టజీవుల పక్షాన సిఐటియు నిరంతర పోరాటం**
- **కార్మిక కోడ్ల రద్దు కోసం ఉద్యమాలు కొనసాగిస్తాం**
- **అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డుల ఏర్పాటు డిమాండ్**
- **ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణలో కీలక పాత్ర**
- **కార్మిక చైతన్యంతోనే కార్మిక రాజ్యం సాధ్యమని నాయకుల విశ్వాసం**

**కర్నూలు, మే 30 (కొత్తస్వరం):** కష్టజీవుల పక్షపాతిగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తోందని, కార్మిక రాజ్య స్థాపన లక్ష్యంగా ప్రతి కార్మికుడు ఐక్యంగా పనిచేయాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్ పిలుపునిచ్చారు. సిఐటియు 56వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండి బజారులో నిర్వహించిన కార్యక్రమంలో నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సిఐటియు జెండాను సీనియర్ నాయకులు పార్వతయ్య, నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు అతి తక్కువ కాలంలోనే రైల్వే కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించి అనేక హక్కులను సాధించిందని గుర్తు చేశారు. కార్మికుల సమస్యలను పక్కదారి పట్టించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు కార్మిక సంఘాలను వినియోగించుకుంటున్నాయని విమర్శించారు. కార్మికుల కష్టార్జితంతో నిర్మితమైన రైల్వేలు, విమానయాన సంస్థలు, బ్యాంకులు, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరిట పెట్టుబడిదారులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సిఐటియు నిరంతరం పోరాడుతోందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు పెద్దన్న పాత్ర పోషిస్తోందని, ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు సాధనలో సిఐటియు కీలక పాత్ర పోషించిందని, అసంఘటిత కార్మికులకు కూడా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వాలు గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మిక కోడ్లను అమలు చేస్తున్నాయని విమర్శించారు. దీంతో కార్మికులు హక్కులు కోల్పోయి బానిసల మాదిరి పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఏర్పడిందన్నారు. కార్మిక కోడ్ల రద్దు కోసం ఇతర సంఘాలతో కలిసి సిఐటియు పోరాటాలు కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. రైతులకు నష్టదాయకమైన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో కూడా సిఐటియు కీలక పాత్ర పోషించిందని, రైతులకు విజయం సాధించే వరకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. హమాలీలు, ఆటో కార్మికులు, షాప్ ఎంప్లాయిస్, ఇతర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వతీకరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్, మున్సిపల్ కార్మికుల శాశ్వతీకరణ కోసం సిఐటియు అనేక ఉద్యమాలు, సమ్మెలు నిర్వహించిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన చరిత్ర సిఐటియుకు ఉన్నదన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సిఐటియు ఎల్లప్పుడూ పోరాట పంథాలోనే ముందుకు సాగుతుందని, కార్మిక చైతన్యంతోనే కార్మిక రాజ్యం సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్. కృష్ణ, రామకృష్ణ, నాగరాజు, నాగస్వాములు, సొలమోను రాజు, రాంబాబు, బజారన్న, విశ్వనాథం, మద్దిలేటి, ఈశ్వర్ తదితరులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.






## శ్రీవాణి దాతలకు టీటీడీ గుడ్‌న్యూస్

**తిరుపతి, మే 30 (కొత్త స్వరం):**

తిరుమల శ్రీవారి భక్తులకు, ముఖ్యంగా శ్రీవాణి ట్రస్ట్ దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుభవార్త అందించింది. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్ల కేటాయింపు విధానంలో పలు కీలక మార్పులు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళం చెల్లించి దర్శనం కోసం ఎదురుచూస్తున్న దాతల కోసం ప్రతిరోజూ 300 ప్రత్యేక దర్శన టికెట్లను కేటాయించనున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఈ కొత్త విధానం జూన్ 10 నుంచి అమల్లోకి రానుంది.

**టీటీడీ నిర్ణయం ప్రకారంశ్రీవాణి దాతలకు టీటీడీ గుడ్‌న్యూస్..**

టికెట్ల జారీ విధానంలో కీలక మార్పులు.. ప్రతిరోజూ 300 ప్రత్యేక దర్శన టికెట్లు.. జూన్ 10 నుంచి కొత్త విధానం అమలు.. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో 200 టికెట్ల కరెంట్ బుకింగ్.. 2027 మార్చి 31 వరకు అమల్లో ఉండనున్న నూతన విధానం 2025 మే 1 తర్వాత శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం అందించిన దాతలు ఈ ప్రత్యేక కోటాకు అర్హులవుతారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఈ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు టికెట్ బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. ప్రస్తుతం టీటీడీ రోజుకు 1,500 శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతోంది. తాజా మార్పుల ప్రకారం వాటిలో 500 టికెట్లను మూడు నెలల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్ కోసం కేటాయించనున్నారు. మరో 200 టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద అందుబాటులో ఉంచనున్నారు. మిగిలిన 800 కరెంట్ బుకింగ్ టికెట్లలో నుంచి 300 టికెట్లను శ్రీవాణి ట్రస్ట్ దాతలకు ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది. ఒకవేళ దాతల కోటాలో టికెట్లు మిగిలిపోతే వాటిని తిరిగి సాధారణ కరెంట్ బుకింగ్ కోటాలో కలపనున్నట్లు తెలిపింది. భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శన వ్యవస్థను అందించడమే ఈ మార్పుల ఉద్దేశమని టీటీడీ పేర్కొంది. కొత్త విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో కొనసాగనుందని వెల్లడించింది.

# మహిళా సాధికారతకు టీడీపీ మహానాడు చారిత్రాత్మక వేదిక

**మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ల ప్రకటనను స్వాగతించిన ఎంపీ బైరెడ్డి శబరి**






### మహిళా నాయకత్వానికి నారా లోకేష్ ప్రకటించిన 33% రిజర్వేషన్

### 17 లక్షల మంది కార్యకర్తలతో మహానాడు ప్రపంచ రికార్డు

### ఎన్టీఆర్ ఆశయాలకు కొనసాగింపుగా మహిళా సాధికారత

### డ్వాక్రా ఉద్యమంతో మహిళల ఆర్థిక పురోగతికి చంద్రబాబు కృషి

### మహిళలు ఓటర్లుగానే కాదు, నాయకులుగా ఎదగాలని పిలుపు

**శ్రీశైలం, మే 30 (కొత్తస్వరం):**

తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. శనివారం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన ఉచిత నేత్ర మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె, ఇటీవల నిర్వహించిన టీడీపీ మహానాడు చరిత్రలో నిలిచిపోయే విధంగా జరిగిందన్నారు. భవిష్యత్ తరాలు కూడా గుర్తుంచుకునేలా, ఎన్టీఆర్ స్ఫూర్తితో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని నారా లోకేష్ ప్రకటించడం మహిళా సాధికారతకు కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. గతంలో మహానాడుకు సుమారు ఐదు లక్షల మంది కార్యకర్తలు హాజరయ్యేవారని, అయితే ఈసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో డిజిటల్, హైబ్రిడ్ విధానంలో క్లస్టర్ల వారీగా నిర్వహించిన మహానాడులో 17 లక్షల మంది కార్యకర్తలు నమోదు చేసుకుని పాల్గొనడం ప్రపంచ రికార్డుగా నిలిచిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేశారని బైరెడ్డి శబరి గుర్తు చేశారు. తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ద్వారా మహిళల ఉన్నత విద్యకు మార్గం సుగమం చేశారని, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించిన నాయకుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని బలోపేతం చేశారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షలకుపైగా డ్వాక్రా సంఘాలు, కోటి మందికిపైగా సభ్యులతో మహిళా సాధికారతకు బలమైన పునాది వేశారని తెలిపారు. డ్వాక్రా రుణాలు, వడ్డీలేని రుణాలు, బ్యాంకు లింకేజీ పథకాల ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దారని వివరించారు. మహిళలు కేవలం ఓటర్లుగా మాత్రమే కాకుండా రాజకీయ నాయకత్వ బాధ్యతలు చేపట్టే స్థాయికి ఎదగాలని నారా లోకేష్ భావించారని బైరెడ్డి శబరి అన్నారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశాభివృద్ధిలో వారి పాత్ర మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కొంతమంది మహిళలకు రాజకీయాల్లో స్థానం అవసరమా అని ప్రశ్నిస్తున్నారని, అలాంటి అభిప్రాయాలకు సమాధానంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల ప్రకటన వెలువడిందని తెలిపారు. మహిళల గౌరవం, ప్రాతినిధ్యం, నాయకత్వానికి టీడీపీ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు ఆదర్శాలను కొనసాగిస్తూ మహిళలకు రాజకీయంగా మరింత అవకాశాలు కల్పించే దిశగా నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం మహిళా లోకానికి చిరస్మరణీయమవుతుందని డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం









**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చేతుల మీదుగా సత్కారం**

**కర్నూలు, మే 30 (కొత్త స్వరం):**

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన సిబ్బందిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్సై ఎం.సి. రంగయ్య, ఆదోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్.హెచ్. చంద్రశేఖర్, వెల్దుర్తి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ టి. నాగభూషణంను ఎస్పీ శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఇతర పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
'పెన్నులో ఇంకు పెట్టుకొని వార్తలు..
రాసేందుకు సరైన వేదిక లేక బాధపడుతున్నారా..?'
అయితే మీ లాంటి వారిని మేం చేర్చుకుంటాం..
అనతి కాలంలోనే ప్రజాదరణ చూరగొన్న.. ఆధునిక టెక్నాలజీతో
వెలువడుతున్న కొత్తస్వరం పేపర్ లో పనిచేసేందుకు
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి
.జిల్లా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, మండల విలేకరులు కావలెను
కొత్తస్వరం
ఆసక్తిగలవారు సంప్ర:
9492813364
యాడ్స్ టార్గెట్స్ లేవు

# దీపాంకర్ భట్టాచార్యపై తప్పుడు ప్రచారం ఖండనీయం: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్



**పశ్చిమ బెంగాల్ మీడియాలో వచ్చిన వార్తలపై తీవ్ర అభ్యంతరం**

**తృణమూల్ నేతతో జాతీయ ప్రధాన కార్యదర్శి ఫొటోను ముడిపెట్టడంపై ఆగ్రహం**

**మీడియా సంస్థలు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**వాస్తవాలను నిర్ధారించుకుని వార్తలు ప్రసారం చేయాలని సూచన**

**నందికొట్కూరులో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం**

**నందికొట్కూరు, మే 30 (కొత్త స్వరం) :**

నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పిక్కిలి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్యపై పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని మీడియా సంస్థలు, పత్రికలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మరో నాయకుడి వ్యవహారానికి సంబంధించి వచ్చిన వార్తల్లో, జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఫొటోను ఉపయోగించడం దురుద్దేశపూర్వక చర్యగా అభివర్ణించారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో నగదు స్వాధీనం చేసుకున్న ఘటనకు తమ పార్టీకి లేదా జాతీయ ప్రధాన కార్యదర్శికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ, సంబంధం లేని ఘటనకు ఆయన ఫొటోను జతచేసి ప్రచారం చేయడం ద్వారా పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నించారని ఆరోపించారు. మీడియా ప్రజలకు నిజాలను తెలియజేసే బాధ్యతాయుతమైన వ్యవస్థ అని పేర్కొన్న వెంకటేశ్వర్లు, వాస్తవాలను నిర్ధారించకుండా తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేయడం బాధాకరమన్నారు. సంబంధిత మీడియా సంస్థలు తమ తప్పును వెంటనే సరిదిద్దుకోవడంతో పాటు ప్రజలకు వివరణ ఇవ్వాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి బాధ్యతాయుతంగా వార్తలు ప్రసారం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా నాయకురాలు ఎస్‌బీబీ ఎస్ మూర్తు జాబి, యువజన సంఘం నాయకుడు గణేష్, కార్మిక సంఘం నాయకులు కాటేపోగు స్వామన్న, బి.రామకృష్ణ, ఎస్.నాగేశ్వరావు, లింగాల శ్రీనివాసులు, వేల్పుల ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో ఏసీబీ దాడులు..

**లంచం తీసుకుంటూ ఉద్యోగి పట్టివేత**

**సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగిపై అవినీతి ఆరోపణలు**

**కాంట్రాక్టర్ నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ వల**

**లంచం సొమ్ము స్వాధీనం చేసుకున్న అధికారులు**

**ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారణ**

**పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉన్న ఏసీబీ**

**నంద్యాల, మే 30 (కొత్త స్వరం) :**



నంద్యాల పట్టణంలో శనివారం సాయంత్రం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న రమేష్ అనే ఉద్యోగి ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం. ముందస్తు సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, లంచం లావాదేవీలను నిర్ధారించిన అనంతరం దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా లంచంగా తీసుకున్న నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, సంబంధిత ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# 40 ఏళ్లుగా నెరవేరని జీఓ-98.. శ్రీశైలం ముంపు బాధితుల ఆవేదన

**ఎన్టీఆర్ ఇచ్చిన హామీ అమలు “ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**1986లో జారీ చేసిన జీఓ-98కు నేటికీ పూర్తి అమలు లేదని ఆవేదన**

**32 మంది ఆత్మబలిదానాలు వృథా కాకూడదంటున్న నిర్వాసితులు**

**యువగళం, ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్**

**66 రోజులుగా కొనసాగుతున్న దీక్షలకు స్పందన లేదని విమర్శ**

**న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరిక**




**శ్రీశైలం, మే 30 (కొత్తస్వరం):**

దివంగత నందమూరి తారక రామారావు 1986 ఏప్రిల్ 15న శ్రీశైలం ముంపు బాధితుల కోసం జారీ చేసిన జీఓ-98కు నేటికి 40 సంవత్సరాలు పూర్తయినా పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ముంపు నిర్వాసితుడు జయన్న ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం ముంపు బాధితుల దీక్షా శిబిరంలో శనివారం మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయాలు, లక్ష్యాలను నెరవేర్చడమే ఆయనకు ఘన నివాళి అవుతుందని పేర్కొన్నారు. జీఓ-98ను పూర్తిగా అమలు చేసి ఉంటే 32 మంది ఆత్మబలిదానాలు జరిగేవి కావని, వారి కుటుంబాలు నేడు ఇబ్బందుల్లో ఉండేవి కావని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని ఎన్టీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని, ముంపు బాధితుల పక్షాన నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు కూడా నేటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీల ప్రస్తావన కూడా ఇప్పుడు కనిపించడం లేదని, స్థానిక ప్రజాప్రతినిధులు సైతం స్పందించడం లేదని జయన్న విమర్శించారు. గత 66 రోజులుగా కొనసాగుతున్న దీక్షలను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. “ఇక మాకు న్యాయం చేసే దిక్కెవరు?” అంటూ జయన్న భావోద్వేగానికి లోనయ్యారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతకాలమైనా పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే దీక్షా శిబిరం వద్దే ఆమరణ నిరాహార దీక్షలకు సిద్ధమవుతామని నిర్వాసితులు హెచ్చరించారు. ఈ దీక్షలో రవిఅయ్య, పఠాన్ ఖాన్, శైలజ, నాగసుంకన్న, రామకృష్ణ, రెహమాన్, నాగేంద్రుడు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణే లక్ష్యం

**పోలీసు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలి**

**ఐపీఎల్ ఫైనల్ నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా**

**గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు విస్తృత తనిఖీలు**

**జూన్ నెలలో ‘ఆపరేషన్ దండాయన’ను సమర్థవంతంగా అమలు చేయాలి**

**సైబర్ నేరాలు, మిస్సింగ్ కేసులపై తక్షణ స్పందనకు ఆదేశాలు**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో అధికారులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ దిశానిర్దేశం**

**కర్నూలు, మే 30 (కొత్త స్వరం) :**

జిల్లాలో నేర నియంత్రణే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, ఆదివారం జరిగే ఐపీఎల్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన ఎస్పీ, గంజాయి విక్రయించే వారిని, వినియోగించే వారిని గుర్తించేందుకు డ్రగ్ డిటెక్షన్ కిట్లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించనున్న ‘ఆపరేషన్ దండాయన’ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు. లైంగిక నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకటి కంటే ఎక్కువ కేసుల్లో నిందితులుగా ఉన్న లైంగిక నేరస్తులపై షీట్లు ఓపెన్ చేసి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. గత ఏడాది కాలంలో శిక్షపడిన నేరస్తుల వివరాలు సేకరించి వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, మిస్సింగ్ కేసులు, దొంగిలించబడిన వాహనాల గుర్తింపులో RTGS CCTV AP-360 అప్లికేషన్ ద్వారా వచ్చే అలర్టులను ప్రతిరోజూ సమీక్షించాలని సూచించారు. CCTV AP-360 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు చెప్పారు. 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రూ.10 లక్షలకు పైగా జరిగిన సైబర్ మోసాలపై తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారి నుంచి జరిమానాలు కోర్టుల ద్వారా మాత్రమే చెల్లించే విధానం ఖచ్చితంగా అమలు కావాలని పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక సంవత్సరం క్రితం బదిలీ అయిన పోలీసు సిబ్బంది పాత స్టేషన్లలో కొనసాగకుండా, వారికి కేటాయించిన స్టేషన్లలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్ర బాబు, భార్గవి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

